
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 34.5
కనిష్ఠం 24.5

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 16 జూలై 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	556.60 (224.5548)	63,789	1,650
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.48 (3.52)	-	167.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	153.541 (18.7319)	-	5,000

చికెన్ ధరలు | లైవ్: రూ.125 | డ్రెస్: రూ.190 | స్కిన్‌లెస్: రూ.210



భువనగిరిలో శిక్షణ తీసుకుంటున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ అభ్యర్థులు

తుదిదశకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ధరణి చట్టంతో రైతులు, ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కోగా, దాని స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతిని ప్రవేశపెట్టింది. ఈ చట్టాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేస్తోంది. భూ సమస్య పరిష్కారానికి ప్రధాన కారణం సరిహద్దు వివాదాలు, పక్కాగా సర్వే చేయకపోవడమేనని తేలింది. అయితే సర్వేయర్ల కొరత తీవ్రంగా ఉండా, ఈ సమస్యను అధిగమించేందుకు ప్రైవేట్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వారికి ఇస్తున్న శిక్షణ తుది దశకు చేరింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

» థియరీ తరగతులు పూర్తి » జిల్లాలో 180మంది అభ్యర్థులు » ఐదు బ్యాచ్‌లుగా విభజన

» మాన్యువల్‌తోపాటు డీజీపీఎస్ యంత్రంపై పూర్తి అవగాహన » ఈ నెల 27నుంచి మూడు రోజులు పరీక్షలు

భూభారతి చట్టం అమలులో భాగంగా గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికి ప్రైవేట్ లైసెన్స్‌డ్ సర్వేయర్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో లైసెన్స్‌డ్ సర్వేయర్లను ప్రతీ మండలానికి నియమించనుంది. జిల్లాలో మొత్తం 17మండలాలు, 301 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. అయితే పాలిటెక్నిక్, ఐటీఐ, సివిల్, బీటెక్ అభ్యసించిన వారికి ప్రైవేట్ సర్వేయర్లుగా శిక్షణ ఇవ్వాలని నిర్ణయించి ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. జిల్లాల వారీగా అర్హులను గుర్తించి 50రోజుల పాటు శిక్షణ ఇస్తోంది. విశ్రాంత సర్వేయర్లు, ప్రస్తుత మండల సర్వేయర్లు వారికి శిక్షణ ఇస్తున్నారు. ప్రతీవారం రోజులకోసారి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ముగింపు దశకు చేరుకుంది. శిక్షణలో భాగంగా థియరీ, క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్స్ నిర్వహించిన అభ్యర్థులకు మూడు రోజులు పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి లైసెన్స్ జారీ చేయనున్నారు. జిల్లాలో ప్రస్తుతం మొత్తం 180 మంది శిక్షణ పొందుతున్నారు. వీరిలో ప్రభుత్వం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో నేర్చుకున్నదెంత? లైసెన్స్‌డ్ సర్వేయర్ల ఎంపిక లెక్క ఎంత అనేది ఈ నెలాఖరులో నిర్వహించే పరీక్షలతో తేలనుంది.

నెలాఖరుకు పరీక్షలు...

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ ఈ నెల 26వ తేదీ నాటికి ముగియనుంది. 50రోజుల పాటు శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 27న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు థియరీ పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్లాటింగ్, కాలిక్యులేషన్‌పై పరీక్ష నిర్వహించనున్నారు. 28, 29 తేదీల్లో క్షేత్రస్థాయికి అభ్యర్థులను తీసుకెళ్లి కొంత మేరకు భూ విస్తీర్ణం అప్పగించి, కొలత వేసి ప్లాటింగ్ చేయించనున్నారు. అనంతరం కాగితాలపై ప్లాటింగ్, కాలిక్యులేషన్ చేసే పరీక్ష నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 180మంది లైసెన్స్‌డ్ సర్వేయర్ల పరీక్షలకు భువనగిరి మునిసిపాలిటీ పరిధిలోని వెన్నెల డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. డిపార్టుమెంట్ ఆఫీసర్‌గా వెన్నెల కళాశాల ప్రిన్సిపాల్‌ను, పరీక్షల అబ్జర్వర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఉన్నతాధికారులు నియమించారు. మరోవారం రోజుల్లో శిక్షణను పకడ్బందీగా పూర్తిచేసేందుకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అనుభవం ఉన్న వారితో పాఠాలు చెప్పిస్తున్నారు.

ఐదు బ్యాచ్‌లుగా విభజన

లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణలో భాగంగా అభ్యర్థులను ఐదుబ్యాచ్‌లుగా విభజించారు. వీరితో ఈనెల 27వ తేదీ వరకు మాన్యువల్‌గా, డిఫరెన్స్ గ్లోబల్ పొజిషన్ సిస్టం (డీజీపీఎస్) యంత్రం ద్వారా సర్వే చేయిస్తారు. సర్వే చేసే సందర్భంలో ఒరిజినల్ రికార్డులను ఎలా చూడాలన్నది వివరిస్తారు. గ్రామ మ్యాపులతో పాటు సర్వే రికార్డుల ఆధారంగా

- మిగతా 8వ పేజీలో...



మూడు శాఖల పంతంతో...

తీరని ప్రజల దప్పిక

» కోట్ల రూపాయల పనులు పూర్తయినా తప్పని ఇక్కట్లు

» మునిసిపల్, ప్రజారోగ్య, మిషన్ భగీరథ శాఖల మధ్య కొరవడిన సమన్వయం

భువనగిరి పట్టణంలో తాగునీటి సరఫరాపై మూడు ప్రభుత్వ శాఖల తీరు మూడు ముక్కలాటగా మారింది. అసంపూర్తి పైపులైన్ పనులను పూర్తి చేయడంలో రెండు ప్రభుత్వశాఖలు, ప్రజలకు సరిపడా తాగునీటిని అందించడంలో మరో శాఖ ప్రదర్శిస్తున్న అలసత్వంతో ప్రజల గొంతెండుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

భువనగిరి పట్టణం వైశాల్యం సుమారు 32 చదరపు కిలోమీటర్లు ఉండగా, 35 వార్డుల్లో సుమారు 11వేల గృహాలు, 70వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరికి సుమారు 8,500 కుళాయిల ద్వారా నిత్యం 5.7ఎంఎల్‌డీ కృష్ణా జలాలు, 5ఎంఎల్‌డీ స్థానిక జలాలు మొత్తంగా 10.7ఎంఎల్‌డీ తాగునీటిని మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. అయితే పట్టణంలోని పలు ప్రాంతాల్లో పైపులైన్, వాటర్ ట్యాంకులు, నల్లా కనెక్షన్లు లేకపోవడంతో ప్రజలు తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో మిషన్ భగీరథ పథకంలో భాగంగా రూ.20కోట్లతో ఆరేళ్ల క్రితం పట్టణంలోని పలు ప్రాంతాలకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. హుస్సేనాబాద్ ఇందిరమ్మ కాలనీలో 10లక్షల లీటర్ల సామర్థ్యంతో నీటి ట్యాంకును నిర్మించారు. సుమారు 1,000 గృహాలకు ఉచితంగా నల్లా కనెక్షన్లు ఇచ్చారు

- మిగతా 8వ పేజీలో...

సంక్షేమ పథకాలు భేష్

సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తమిళనాడు బృందం



వెల్లంకి గ్రామపంచాయతీ వద్ద సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ బృందం

రామన్నపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి):సంక్షేమ పథకాల తీరు బాగున్నాయని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ తమిళనాడు బృందం తెలిపింది. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో బృందంసభ్యులు పర్యటించారు. గ్రామపంచాయతీ కార్యాలయం, రైతు వేదిక, గ్రంథాలయం, పల్లెప్రకృతి వనం,నర్సరీ, ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతి గదిలో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న తీరును గమనించారు. మధ్యాహ్న భోజనపథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తు న్న పథకాల అమలు బాగుందని, ప్రజలు వీటిని ఉపయోగించుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో డివిజినల్ పంచాయతీ అధికారి రవూఫ్ అలీ, ఆర్‌డబ్ల్యూఎస్ గ్రామ ప్రత్యేకాధికారి అశిష్ రాఘవ, ఏపీ వో పి.వెంకన్న, టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, పంచాయతీ కార్యదర్శి మోహన్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌పీవోగా మోత్కూరు సింగిల్ విండో

తొలి గ్రాంటు రూ.3.16లక్షల చెక్కు అందజేత



హైదరాబాద్‌లో ఎన్‌డీసీసీబీ చైర్మన్ శ్రీనివా‌స్‌రెడ్డి నుంచి చెక్కు అందుకుంటున్న మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్వర్లు

మోత్కూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు రైతు సేవా సహకార సంఘానికి ఎఫ్‌పీవో (ఫార్మర్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్)గా అనుమతి లభించింది. మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ రాజేంద్రనగర్‌లోని ఆడిటోరియంలో జరిగిన ఎఫ్‌పీవోల అభివృద్ధి సమావేశంలో ఈ విషయం ప్రకటించారు. ఎఫ్‌పీవో నిర్వహణకు తొలి గ్రాంటుగా రూ.3.16లక్షల చెక్కును వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎన్‌డీసీసీబీ అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్‌రెడ్డి.. మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఎఫ్‌పీవోకు ఏడాదికి రూ.6లక్షల చొప్పున మూడేళ్ల రూ.18లక్షలు కేంద్ర ప్రభుత్వ నిధులు అందుతాయన్నారు. రాష్ట్రంలో సుమారు 1100 సింగిల్ విండోలు ఉండగా 311 సంఘాలకు ఎఫ్‌పీవో అనుమతి లభించిందని, అందులో మోత్కూరు సంఘం ఉండటం విశేషమన్నారు. ఎఫ్‌పీవో అనుమతి లభించడంపై సంఘం సీఈవో కె.వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.

గంధమల్ల ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని పెంచాలి

● *ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు*

ఆలేరురూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆలేరు నియోజకవర్గానికి సాగు నీటిని అందించే గంధమల్ల ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని ఐదు టీఎంసీలకు పెంచాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వీ.కోటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మందనపల్లిలో జరిగిన ప్రజా సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా రాష్ట్రంలో రైతుల పరిస్థితులు మారడంలేదన్నారు. గంధమల్ల ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని ఎనిమిది టీఎంసీల నుంచి 4 టీఎంసీలకు కుదించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో హామీలను ఇచ్చినా, రైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. రాష్ట్రంలో యూరియా, డీఏపీ కొరత తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల భిక్షపతి, ఆర్.జనార్ధన్, కల్లెపు ఆడవయ్య, బేజాడి కుమార్, సహదేవ్ రాజయ్య, సీత, పాల్గొన్నారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇవ్వండి

» విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాది వేయాలి

» వసతిగృహ అధికారుల సమీక్షలో కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి వారి భవిష్యత్‌కు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ఎం.హనుమంతరావు సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం అదనపు కలెక్టర్ భాస్కరరావుతో కలిసి అన్ని వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, స్పెషల్ ఆఫీసర్లు, కేర్ టేకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెసిడెన్షియల్ పాఠశాలల మీద నమ్మకం కలిగి ఈ 2025-26 విద్యా సంవత్సరం వసతి గృహాల్లో చదివే విద్యార్థులశాతం పెరిగిందన్నారు. చదువుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఇక్కడి వాతావరణం అలవాటయ్యే వరకూ ప్రిన్సిపాళ్లు శ్రద్ధ వహించాలని, వారి మానసిక పరిస్థితులను అర్థం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యా బోధన చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధవహిస్తూ హాస్టళ్లను ఆర్‌బీఎస్‌కే బృందాలు సందర్శించి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని, వంటకు నాణ్యమైన సరుకులను వినియోగించాలన్నారు. విద్యార్థుల వసతి గదులు, పడకలు, మూత్రశాలలు శుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. శుద్ధమైన తాగునీటిని అందించాలని చెప్పారు. సమీక్షలో ఆర్సీవోలు విద్యారాణి, స్వప్న, జిల్లా బీసీ సంక్షేమాధికారి యాదయ్య, ఎస్సీ సంక్షేమాధికారి శ్యాంసుందర్, ఎస్టీ సంక్షేమాధికారి నాగిరెడ్డి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, పలు వసతి గృహాల ప్రిన్సిపాళ్లు, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

సీట్ల భర్తీ కోసం లాటరీ

భువనగిరి కేంద్రీయ విద్యాలయంలో రెండో తరగతిలో ఖాళీగా ఉన్న నాలుగు సీట్ల భర్తీ కోసం మంగళవారం కలెక్టర్ హనుమంతరావు లాటరీ తీసి ఎంపికచేశారు. లాటరీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, కేంద్రీయ విద్యాలయాల మార్గదర్శకాల ప్రకారం విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ స్వయంగా డ్రాతీసి ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో మనీషా శుక్లా, శ్రీపాద, ఆనంద్‌కుమార్, అంకిత్ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలపై కఠిన చర్యలు

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ వహించి జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా చూడాలని కలెక్టర్ హనుమంతరావు వైద్య సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఎంహెచ్‌వో మనోహర్ మాతృ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన 52 మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా వైద్యులు ప్రత్యేక శ్రద్ధం వహించాలని, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ప్రసవానికి వచ్చిన గర్భిణులపట్ల జాగ్రత్తగా వ్యవహరించి సాధారణ కాన్పు జరిగేలా చూడాలన్నారు. అనంతరం ప్రసవానికి ముందు, ప్రసవానంతరం గర్భిణులకు అందించాల్సిన వైద్యసేవల గురించి స్త్రీ వైద్య నిపుణులు కవిత, నిర్మల ఏఎన్ఎం, ఆశాలకు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో మనోహర్, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు యశోద, శిల్పిని, పిల్లల వైద్యులు కరణ్‌రెడ్డి, మోహన్, ఇమ్యూనైజేషన్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి

రాజాపేట: ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజాపేట మండలం బూరుగుపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును భూభారతిలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, తహసీల్దార్ అనిత, ఎంపీవో కిషన్, వెలుగు ఏపీఎం నర్సింహ, హౌసింగ్ ఏఈ కోటయ్య, పంచాయతీ కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలపై పాలక, ప్రతిపక్షాలది కపట ప్రేమ

టీడీపీ తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాంభానేస్ ముదిరాజ్



టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణను సన్మానిస్తున్న కార్యకర్తలు

మోత్కూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు అంటూ పాలక, ప్రతిపక్షాలు బీసీలపై కపట ప్రేమ చూపుతున్నాయని టీడీపీ తుంగతుర్తి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు నక్క రాంభానేస్ ముదిరాజ్, నియోజక వర్గ కన్వీనర్ ఆకారపు రమేష్ విమర్శించారు. మంగళవారం మోత్కూరులో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో టీడీపీ బీసీలకు 33శాతం రిజర్వేషన్లు ఇచ్చి బడుగు, బలహీన వర్గాలకు పాలనలో భాగస్వామ్యం కల్పించిందన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ అది అమలయ్యేది కాదంటూ మల్లగుల్లాలు పడుతున్నాయని విమర్శించారు. అనంతరం టీడీపీ మోత్కూరు మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దామరోజు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా దేవర మల్లయ్య, ప్రధాన కార్యదర్శులుగా మహేశ్వరం వెంకటేశ్వర్లు, ఎగుమాటి బొందిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మెంట ఎల్లేష్, సూదగాని అంజనేయులు, జిల్ల రత్నం, కార్యదర్శులుగా కుక్కల యాదగిరి, సాదుల సత్తయ్య, కోశాధికారిగా బత్తిని సుదర్శన్, పట్టణ అధ్యక్షుడిగా ఎండీ గాలిబ్, ఉపాధ్యక్షుడిగా బయ్యని జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా గొడిశాల శ్రీను, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గొడిశాల మానస, జాకీర్, గుండు రాజు, కార్యదర్శులుగా బాలగాని నర్సయ్య, ఎడ్ల రాములు, సతీష్, కోశాధికారిగా మెంట నీలమ్మ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

సైబర్ మోసాలను అరికట్టాలి

హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ అంజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మండల కోఆర్డినేటర్ విశ్వనాథ్

బొమ్మలరామారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ ప్రిన్సిపాల్ అంజయ్య, ఎస్ఎస్‌టీ, సీఎఫ్ఎల్ మండల కోఆర్డినేటర్ ఎల్లబోయిన విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఎస్ఎస్‌టీ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కీసర ఆధ్వర్యంలో మండలంలోని రంగాపూర్ హైదరాబాద్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతతోపాటు విద్యా, ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతీ ఒక్కరిని సైబర్ నేరాలపై చైతన్యవంతం చేయాలన్నారు. దేశ భద్రతతోపాటు దేశ ఆర్థిక అభివృద్ధిలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉమామహేశ్వరి, భాను, షైమూనా, వీకేఎస్ రెడ్డి, అజయ్, శ్రీశైలం, భాను, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఎరువుల ధరలు

» సాగు మరింత భారం

» డీఏపీ, యూరియా మినహా మిగతా ఎరువుల ధర పెంపు

» బస్తాకు రూ.50 నుంచి 330 పెరుగుదల

» ఉమ్మడి జిల్లా రైతులపై రూ.75.84కోట్ల అదనపు భారం

7



విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 15 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు రావాల్సిన బెన్‌ఫిట్స్ వెంటనే చెల్లించాలని, హైకోర్టు ఆదేశాలు అందరికీ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి వ్యయ వందన యోజన పథకం తెలంగాణాలో అమలు చేసేలా చూడాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ పరిపాలనాధికారి జగన్మోహన్ ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అరుణమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, బాలరాజు, సభ్యులు గుండు జగన్మోహన్, శకుంతల, సోమయ్య, ఒగ్గు క్రిష్టోఫర్, సీవీ రామనర్సయ్య తదితరులున్నారు.

మానవ సంబంధాలే ఊర్లకు బలం.

ఆ ఊరితో.. అనుబంధం ఆత్మీయత

ఇక జ్ఞాపకాలే..


ఖాళీగా నర్సిరెడ్డిగూడెం గ్రామం



అక్కా ఏమైందే పొద్దున్నుంచీ కనిపిస్తలేవు.. ఒంట్లో ఎట్లుందే ఏమైన అయ్యిందా, అయ్యో జ్వరమొస్తే చెప్పొచ్చు గదే, వెళ్లి మందులైనా తెచ్చిద్దు.. ఇలా పల్లెల్లో ఒకరికొకరుగా ఉన్నోళ్లు ఇప్పుడు ఒక్కో ఊరిలో ఉంటున్నారు. ఇప్పుడు బంధాలు, అనుబంధాలన్నీ వారికి అవతల గట్టుగా ఉన్నాయి. ఒకప్పుడు గట్టు సమీపంలోని చెరువు ఊరందరినీ చల్లగా చూసి పొట్టనింపితే ,ఆ చెరువును రిజర్వాయర్ చేసేందుకు ఊళ్లను ఖాళీ చేయించారు. అందులో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం నర్సిరెడ్డిగూడెం ఒకటి. గుట్టలు, పచ్చల పొలాల మధ్య కళకళలాడిన ఊరు, గ్రామస్థులు ఊరొదిలిపోవడంతో కళావిహీనమైంది. అక్కడి ప్రజలూ అనుబంధాలకూ దూరమయ్యారు ఊరితోనూ, అందరితోనూ...

(ఆంధ్రజ్యోతి- మర్రిగూడ)

నర్సిరెడ్డిగూడెం గ్రామం 250 ఏళ్ల కిందట ఏర్పాటైనట్లు గ్రామస్థులు తెలిపారు. 1250 జనాభా గల ఈ గ్రామంలో 298 కుటుంబాలు జీవనం సాగించేవి. వ్యవసాయమే ఉపాధిగా జీవిస్తున్న వారే అత్యధికంగా ఉండేవారు. ఈ గ్రామంలో 915 ఎకరాలు ఉండగా 95 మంది రైతులు ఉన్నారు. సమీపంలోనే చర్లగూడెం చెరువు ఉండటంతో సాగు, తాగునీటికి అంతగా ఇబ్బంది పడేవారు కాదు. ఏ కష్టమొచ్చినా ఒక్కతాటిపై నిలబడి ఒకరికొకరు సాయం చేసుకునేవారు. ఏ అరమరికలు లేని గ్రామంగా నర్సిరెడ్డిగూడెంకు పేరుంది. పార్టీల పరంగా ఎవరు ఎలా ఉన్నా గ్రామం విషయానికొస్తే అంతా ఏకతాటిపై ఉండేవారు.

ఒకనాడు వరంగా ఉన్న చర్లగూడెం చెరువు నేడు వారి వలసకు కారణమైంది. ప్రస్తుతం చెరువును రిజర్వాయర్‌గా మారుస్తున్నారు. ఈ రిజర్వాయర్ కింద మొదట ముంపునకు గురవుతున్న గ్రామం కూడా ఇదే. చెరువు నీడనే బతికిన ఈ గ్రామస్థులు ఈ చెరువు ముంపు పరిధిలో ఉండటం, వర్షాకాలం సమీపిస్తుండటం, రిజర్వాయర్ పనులు పూర్తికావస్తున్న నేపథ్యంలో అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయించారు. రిజర్వాయర్ నిర్మాణంతో సర్వం కోల్పోయిన నర్సిరెడ్డిగూడెం గ్రామస్థులు చెట్టుకొకరు పుట్టకొకరుగా వెళ్లిపోయారు. ఒకనాడు బంధాలు, అనుబంధాలు, ఆత్మీయతను పంచుకున్న గ్రామస్థులు గతాన్ని తలుచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

● ఇదీ ప్రాజెక్టు నేపథ్యం

ఫ్లోరైడ్ నుంచి విముక్తి కల్పించాలనే ఉద్దేశంలో 2015లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌ను నిర్మాణానికి పూనుకుంది. ఇందులో భాగంగా రూ.1,452 కోట్లతో 3,247 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్ చేపట్టనుండగా, దీని కింద నర్సిరెడ్డిగూడెం, చర్లగూడెం, ఎంకపల్లి, వెంకటపల్లి తండాలు పూర్తిగా ముంపుకు గురవుతున్నట్లు అధికారులు గుర్తించారు. రిజర్వాయర్ ఆయకట్టు నిర్మాణానికి అతి సమీపంలో ఉన్న మొదటి గ్రామం నర్సిరెడ్డిగూడెం. ఈ గ్రామస్థులందరికీ చింతపల్లి మండలంలోని సాయిబాబా టెంపుల్ వెనక భాగంలోని ప్రభుత్వ భూమిని కేటాయించారు. 257 మందికి పునరావాసం కల్పిస్తున్నట్లు ధ్రువపత్రాలు ఇవ్వగా, ఇంకా 41 మంది బాధితులకు అందజేయలేదు. అదే విధంగా 75మంది భూనిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, భూనష్టపరిహారం అందించలేదు. అయితే తమను బలవంతంగా ఖాళీ చేయించారని బాధితులు వాపోతున్నారు. బాధితులకు ఇంటి స్థలాన్ని ఇచ్చి నేరుగా ఇంటిని నిర్మించి ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ అమలు చేయలేదు.

● ఒక్క కుటుంబంలా ఉండేవాళ్లం



గ్రామంలోని ప్రజలం కులం, మతం భేదాలు లేకుండా ఆత్మీయంగా కలిసి ఉండేవాళ్లం. మా గూడెం చుట్టూ గుట్టలు ఉండేవి. పొద్దున లేస్తే ఉమ్మడి కుటుంబంలా ఉంటూ ఒకరికొకరు వరసలు పెట్టి పలకరించుకునేవాళ్లం. ఊరు వదిలి శివన్నగూడెంకు వచ్చి ఉంటున్నాం. మా పల్లెలో బంధాలను మరువలేక పోతున్నాం.

● మాదగోని సత్తమ్మ, మాజీ ఎంపీటీసీ



ఇంటి సామానుతో ఊరొదిలి వెళ్తోన్న ఓ కుటుంబం(ఫైల్)

నా పిల్లలు చెల్లా చెదురయ్యారు



నాకు ముగ్గురు కుమారులు, కుటుంబం ఉమ్మడిగా ఉండేది. ఊరిలోనే కలిసి ఉండేవారం. రిజర్వాయర్ పుణ్యమా అంటూ నా కుమారులు చెల్లా చెదురయ్యారు. పనుల కోసం ఇద్దరు హైదరాబాదులో ఉంటున్నారు. అందరికీ దూరంగా ఉండే పరిస్థితి వచ్చింది. 10 మంది మనమళ్ల, మనవరాళ్లతో కలిసి ఉండే నేను ప్రస్తుతం చిన్నకుమారుడితో కలిసి శివన్నగూడెంలో ఇల్లు తీసుకుని ఉంటున్నా. ఈ జీవిత చరమాంకంలో ఈ పరిస్థితి ఎవరికీ రావొద్దు.

అయితగోని వెంకటయ్యగౌడ్,

మరో ఊరిలో కూలీనయ్యా



మా ఊరిలో నాకు జీవనాధారంగా వ్యవసాయ భూమి ఉంది. రిజర్వాయర్ కింద నా మూడు ఎకరాల భూమి పోయింది. భూమికి నష్ట పరిహారం అందింది. ఆర్ అండ్ఆర్ ప్యాకేజీ పునరావాసంలో నా పేరు లేని లేదు. ఇప్పటివరకు నా భూమిలో సేద్యం చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే వాడిని. ఇప్పుడు కొత్తగూడెం వలస వచ్చి వ్యవసాయం లేక కూలి పని చేసుకుంటున్నాం. ఊర్లో ఉంటే కలోగంజో కలిసి బతికేవాళ్లం.. ఇప్పుడిలా దూరంగా తెలియని ఊరిలో ఉండాల్సి వస్తోంది.

మాదగోని యాదయ్య, భూ నిర్వాసితుడు (కొత్తగూడెం)

కోలుకున్న విద్యార్థినులు

దేవరకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన ఆశ్రమ పాఠశాలలో తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న 12 మంది విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడిందని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రకాష్ తెలిపారు. వారిని పాఠశాలకు పంపించినట్లు ఆయన తెలిపారు. కాగా అస్వస్థతకు గురైన 45 మంది విద్యార్థినుల ఆరోగ్యం మెరుగుపడిందని ఆర్డీవో రమణారెడ్డి తెలిపారు. పాఠశాలను దేవరకొండ తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో డానియల్ మంగళవారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాల్లో మరో రెండు రోజులు వైద్యశిబిరం కొనసాగిస్తామని వైద్యులు తెలిపారు. ఇదిలా ఉండగా విధుల్లో నిర్లక్ష్యం వహించి 45 మంది విద్యార్థినుల అస్వస్థతకు కారణమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేదాద్రిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుడు గుండు నరసయ్య మృతి


నరసయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జుట్టుకొండ సత్యనారాయణ


నరసయ్య(ఫైల్‌ఫొటో)

పెన్‌పహాడ్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా పెన్‌పహాడ్ మండలం మహమ్మదాపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు, స్వాతంత్ర్య సమరయోధుడు గుండు నరసయ్య(102) మంగళవారం అనారోగ్యంతో మరణించారు. ఆయనకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. నర్సయ్య గ్రామంలో పటేల్ పట్వారీగా పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అహర్నిషలు కృషి చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. సూర్యాపేట మాజీ మునిసిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావులు నర్సయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా నర్సయ్య అంత్యక్రియల్లో వివిధ పార్టీ నాయకులు బిట్టు ఇందిరావెంకన్న, కొండేటి లచ్చయ్య, కొండెటి పవన్‌కుమార్, భూక్య శివనాయక్, భూక్య సందీప్‌రాథోడ్, కొండేటి లచ్చయ్య, కొండేటి రజిని సుధాకర్, సముద్రాలు శ్రీనివాస్‌లు, సముద్రాల రాంబాబు, పత్తిపాక వేణుదర్, ఎర్రంశెట్టి రామలింగయ్య, బొలిశెట్టి సత్యం, కర్నాటి సైదులు, అజయ్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు లారీ దగ్ధం


పూర్తిగా దగ్ధమై బూడిదైన లారీ

వలిగొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):సాంకేతిక కారణాలతో లోడుతో ఉన్న లారీ సోమవారం అర్ధరాత్రి పూర్తిగా దగ్ధమైంది. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి చెన్నైకి ప్లాస్టిక్ ముడిపదార్థం లోడుతో లారీ బయలుదేరింది. నాతాళ్లగూడెం గ్రామశివారుకు సోమవారం రాత్రికి చేరుకోగానే లారీ కింది భాగంలో షార్ట్‌సర్క్యూట్ అయ్యింది. అప్రమత్తమైన డ్రైవర్ లారీని పక్కకునిలిపాడు. ఒక్కసారిగా మంటలు వ్యాపించి లారీలోని ప్లాస్టిక్ ముడిపదార్థాంతో పాటు, లారీ దగ్ధమైంది. ఫైర్‌ఇంజన్ మంటలు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. డ్రైవర్ రహీసూల్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఫార్మసీ, లా కాలేజీల ఏర్పాటే చిరకాల కోరిక

● సీఎం సహకారంతో విద్యావ్యవస్థలో
● సమూల మార్పులకు ప్రయత్నిస్తున్నాం : మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో ఫార్మసీ, న్యాయ(లా)కాలేజీలను ఏర్పాటుచేయించడమే తన చిరకాల కోరిక అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మూడు దశాబ్దాలుగా ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు తనను ఆశీర్వదిస్తున్నారని, వారి ఉన్నతి కోసం ఎంతచేసినా తక్కువేనన్నారు. జిల్లాను అన్నిరంగాల్లో అగ్రస్థానాన నిలపాలనేదే తన ప్రధాన ధ్యేయమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నల్లగొండలోని మహాత్మగాంధీ విశ్వవిద్యాలయం, పలు కాలేజీలు, పాఠశాల విద్యకు సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. మంత్రి వచ్చాక దుతగా ఎంజీ యూనివర్శిటీలో మౌలిక సదుపాయాల కోసం రూ.60.22 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే కొత్త కోర్సుల గురించి ఆరా తీయగా కొత్తగా ఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం లాంటి కోర్సులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ మంత్రిని కోరారు. స్పందించిన మంత్రి దీనిపై సీఎంతో చర్చిస్తామని చెప్పారు. నల్లగొండలో యూనివర్శిటీ కాలేజీ ఆఫ్ ఫార్మశీ, లా కాలేజీల ఏర్పాటు చేయాలనేది తన చిరకాల కోరిక అని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. త్వరలో ఈ నూతన కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఇక యూనివర్శిటీ చాలా ప్రతిష్ఠాత్మకమైనదని, దాని ఖ్యాతిని మరింత పెంచేలా వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్‌తో పాటు పాలకసభ్యులు పని చేయాలన్నారు. ఇక జిల్లాలోని పలు కాలేజీలు, పాఠశాల విద్యకు సంబంధించి కూడా పలు అంశాలపైనా చర్చించారు. డిగ్రీ, జూనియర్ కాలేజీల్లోని మౌలిక సదుపాయాలు, హైస్కూల్స్ బలోపేతం కోసం అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌తో ప్రభుత్వ కాలేజీలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మాట్లాడుతానన్నారు. సమీక్షలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, సాంకేతిక, ఉన్నత విద్యామండలి కమిషనర్ శ్రీదేవసేన, ఎంజీ యూనివర్శిటీ వీసీ అల్తాఫ్‌హుస్సేన్, రిజిస్ట్రార్ రవి తదితరులు పాల్గొన్నారని మంత్రి కార్యాలయం మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

కాంగ్రెస్‌లో హాట్‌టాపిక్‌గా సీఎం ప్రసంగం

● పార్టీలో వర్గపోరు వద్దని సూచన
● సమస్యలుంటే తన వద్దకూ రావచ్చని సీఎం రేవంత్‌రెడ్డి సలహా



మోత్కూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి తుంగతుర్తి కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడిన తీరు నియోజకవర్గంలో హాట్‌టాపిక్‌గా మారింది. తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గాలు ఉన్నాయన్నది సీఎం గుర్తించారని, వర్గాల మధ్య ఉన్న సమస్య పరిష్కారానికి మార్గం కూడా చూపించారని పలువురు కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మందుల సామేల్‌ను ఢిల్లీ అధిష్టానం టికెట్ ఇస్తే, ఎన్నికల ఖర్చుకు రూ.50 వేలు జేబులో పెట్టుకుని, జేబుకు సోనియాగాంధీ బొమ్మ పెట్టుకుని వస్తే తుంగతుర్తి ప్రజలు తమ రక్తాన్ని చెమటగా మార్చి, గుండెల్లో పెట్టుకుని, తమ భుజాలపై మోసి 60 వేల ఓట్ల మెజార్టీతో సామేల్‌ను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అదేవిధంగా వారందరూ నీ కుటుంబ సభ్యులు, వారిని మంచిగ చూసుకోవాలని ఎమ్మెల్యే సామేల్‌కు సూచించారు. ఒకరికి బాధ ఉంటుంది. ఒకరికి దుఃఖం ఉంటది, ఒకరికి కోపం ఉంటది. ఒకరికి ఆలోచన ఉంటది, ఒకరికి ఆశ ఉంటది. శాసనసభ్యుడివి నీవు ఓపికతో అందరిని కలుపకపోవాలి. వారిని కడుపులో పెట్టుకుని చూసుకోవాల్సి పెద్దన్న బాధ్యత నీదేనని చెప్పారు. ఏదైనా సమస్య ఉంటే పక్కన ఉత్తమన్న ఉన్నడు, కాదంటే మీ ఎంపీ చామల కిరణ్ ఉన్నడు, కాదుకూడదంటే అడ్లూరి లక్ష్మణ్ ఉన్నడు, అక్కడ కూడా కాకుంటే పైన నేనున్నా అంటూ సూచించారు. మీరు అధైర్య పడవద్దు. స్థానిక సంస్థల ఎన్నికలు సర్పంచులైన, ఎంపీటీసీ కావచ్చు, జడ్పీటీసీ కావచ్చు ఏ ఎన్నికలైన మిమ్ములను గెలిపించే బాధ్యత పార్టీ, ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఎమ్మెల్యే సామేల్‌ను గెలిపించే బాధ్యత మీరు తీసుకున్నరు, మిమ్ములను గెలిపించే బాధ్యత మేం తీసుకుంటామని సీఎం అన్నారు. తొందరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయన్నారు. నల్లగొండలో నిఖార్సైన కార్యకర్తలు ఉన్నారు, వారు కష్టపడతారు. నల్లగొండకు ప్రత్యేకంగా సమయం ఇచ్చి వారి సమస్యలు తీర్చాలని టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు. నల్లగొండ కార్యకర్తలకు ఆవేశం ఎక్కువ కానీ వారు చెడ్డ వారు కాదు, వారికి కోపం వస్తే దాచుకునే తత్వం లేదు. కోపంగా మాట్లాడుతారు కాని వివరించి చెబితే వారు అర్థం చేసుకుంటరు, వింటారని సీఎం చెప్పారు. సీఎం కాంగ్రెస్ కార్యకర్తల గురించి మాట్లాడేటప్పుడు పలుమార్లు ఎమ్మెల్యే సామేల్ భుజం తట్టారు. తుంగతుర్తి కాంగ్రెస్‌లో ఉన్న విభేదాలను గుర్తించే సీఎం ఇలా మాట్లాడారని చెప్పుకుంటున్నారు. సీఎం తీసుకుంటున్న చొరవతోనైనా కాంగ్రెస్‌లో వర్గాలు సమసి పోతాయా లేదా అన్నది వేచిచూడాల్సిందే.

కన్నీరైన పల్లెర్ల

● భార్య కుట్రలో హతమైన స్వామి ● గ్రామంలో విషాదఛాయలు

ఆత్మకూరు(ఎం), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : భార్య కుట్రలో హతమైన వస్తుప్పల స్వామి స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం పల్లెర్లలో మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. జరిగిన దారుణాన్ని ప్రతీ ఒక్కరూ ఖండించడంతో పాటు కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్వామికి మేనమామ కుమార్తె స్వాతితో 22 ఏళ్ల కిందటే వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వామి తండ్రి చనిపోగా ఏకైక కుమారుడిని కోల్పోయానని తల్లి లక్ష్మమ్మ రోదించింది. తండ్రి మృతదేహాన్ని చూసి స్వామి పిల్లలు కంటతడిపెట్టారు. స్వామి హత్యకు కారకులైన నిందితులకు కఠిన శిక్ష పడాలని, వారి జీవితఖైదు విధించాలని బంధువులు డిమాండ్ చేశారు.


స్వామి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, కుమార్తె

ఆర్తనాదాలతో మార్మోగిన భువనగిరి ఆసుపత్రి



రోదిస్తూ ఆసుపత్రికి వస్తున్న బంధువులు

భువనగిరి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మూటకొండూరు మండలం కాటేపల్లిలో సినిఫక్కీలో దారుణహత్యకు గురైన వస్తువుల స్వామి బంధుమిత్రుల రోదనలతో యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రి ప్రాంగణం మంగళవారం మార్మోగింది.వివాహేతర సంబంధానికి అడ్డువస్తున్నాడనే నెపంతో భార్యనే కారు ప్రమాదం రూపంలో హత్య చేయించింది. స్వామి మృతదేహాన్ని చూసేందుకు సమాచారాన్ని అందుకున్న బంధుమిత్రులు పెద్దసంఖ్యలో జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. దీంతో ముందు జాగ్రత్త చర్యలో భాగంగా పట్టణ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


శివ(ఫైల్‌ఫొటో)

యాదగిరిగుట్ట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో అప్పుల బాధలు భరించలేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ బొడ్డుపల్లి భాస్కర్ మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సైదాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి శివ(25) వైటీడీఏ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. అతడికి వ్యక్తిగతంగా అప్పులు పెరిగిపోవడంతో ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. శివ తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కట్టంగూరులో కౌలు రైతు..


యాదయ్య(ఫైల్)

కట్టంగూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కట్టంగూరులో అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన మాతంగి యాదయ్య(57) తనకున్న ఎకరం భూమితో పాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగుచేశాడు. రెండేళ్లుగా కాలం కలిసి రాక పంట దిగుబడి రాకపోవడంతో అప్పుల పాలయ్యాడు. ప్రస్తుత సేద్యం చేసిన పత్తి చేను కళ్లెదుటే ఎండిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. వారం రోజులుగా ఇంట్లో కుటంబసభ్యులతో అప్పులు పెరిగిపోయాయని వాపోయాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వరండాలో ఉరివేసుకున్నాడు. సాయంత్రం యాదయ్య భార్య ఇంటికి వచ్చి చూసే సరికి అప్పటికే మృతి చెందాడు. సుమారు రూ.6లక్షలు అప్పు చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. యాదయ్య కుమారుడు మహేష్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి


గోవర్ధన్(ఫైల్‌ఫొటో)

చిలుకూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలో విద్యుదాఘాతంతో కూలీ మృతి చెందాడు. ఎస్ఐ సురభి రాంబాబు తెలిపినవివరాల ప్రకారం జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన దాసి గోవర్ధన్(28) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం గ్రామానికి చెందిన రైతు గుంటు వెంకన్న పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి విద్యుత్ సరఫరా కావడం లేదని, చూడాలని గోవర్ధన్‌ను కోరాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులను గోవర్దన్ తీసి మరమ్మతు చేస్తుండగా 11కేవీ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వెల్డర్..


కృష్ణ(ఫైల్‌ఫొటో)

భువనగిరిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో మంగళవారం పట్టాలు దాటుతుండగా గూడ్స్‌రైలు ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉండే సంతోష్‌నగర్‌కు చెందిన వెల్డర్ కార్మికుడు మిట్టపల్లి కృష్ణ(56) అర్బన్‌కాలనీ రైల్వే క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వరంగల్ నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణకు భార్య, ముగ్గురు కుమారుడు ఉన్నారు.

మృతదేహం ఆచూకీ లభ్యం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి మృతదేహం ఆచూకీ లభించిందని యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపారు. ఆయన మంగళవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సెల్‌ఫోన్ ఆధారంగా ఈ నెల 14న లభించిన మృతదేహం గుట్ట మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగుండ్లపల్లి గ్రామానికి చెందిన బండ వెంకటేశ్(48)గా గుర్తించినట్లు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశామన్నారు. వెంకటేష్ కుమారుడు ప్రేమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

అడ్డగూడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : యాద్రాదిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ వెంకట్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నపడిశాల గ్రామానికి చెందిన బండారు పుష్ప హైదరాబాద్‌లోని బంధువుల వద్దకు వెళ్లే క్రమంలో చౌళ్లరామారం స్టేజీ వద్ద బస్సు కోసం రోడ్డును దాటుతోంది. అదే సమాయంలో సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం రెడ్డిగూడెం గ్రామానికి చెందిన పెద్ది వీరేష్ ద్విచక్రవాహనంపై అటుగా వెళ్తూ రోడ్డుదాటుతున్న పుష్పను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆమెతో పాటు వీరేష్‌కి గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆసుప్రతికి తరలించారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

చౌటుప్పల్ పట్టణంలో..

చౌటుప్పల్ రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రం వలిగొండ ఎక్స్ రోడ్డు వద్ద ఆటోను కారు ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని ఆశ్రమం నుంచి పలువురు ఆటోలో వస్తున్నారు. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోపల్టీలు కొడుతూ ముందువెళ్తున్న బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ శక్తి నాగరాజు, ప్రయాణికులు గుప్పల్లి స్రవంతి, బాదం కవిత, కోటేశ్వరి, కానుగుల విష్ణు, గడ్డం నవీన్‌రెడ్డితో పాటు ద్విచక్రవాహనం నడుపుతున్న దుబేకు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'



బుద్ధుడితో నా ప్రయాణం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

నల్లగొండ, నాగార్జునసాగర్ జూలై 15(ఆంధ్రజ్యోతి): బుద్దిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రాత్రి 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకం ప్రదర్శించారు. బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ జీవిత వృత్తాంతం ఆధారంగా రూపొందించిన తెలుగు నాటకంలో బాల్యం, విద్య, సామాజిక మార్పుకోసం, సాంస్కృతిక మార్పు కోసం అంబేడ్కర్ జీవితంలో ప్రభావితం చేసిన బుద్ధుని రచనలను నటీ, నటులు ప్రదర్శించారు. సుమారు రెండు గంటల పాటు సాగింది. ఈ కార్యక్రమంలో బుద్దిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు పరందాములు, సంకు లింగయ్య, నామ వెంకటేశ్వర్లు, మండల అంజనేయులు, హరి, విష్ణు, రామయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం సిబ్బంది నల్లగొండకు వచ్చి బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని తిలకించారు.

నాటిక శక్తివంతమైన కళారూపం

● నల్లగొండలో రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు ప్రారంభం



కళాకారులకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకుడు కొలనుపాక రవికుమార్

నల్లగొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): నాటిక శక్తివంతమైన కళా రూపమని, ప్రేక్షకులను అలరించడమే కాకుండా సామాజిక సమస్యల గురించి ఆలోచింపజేస్తుందని రాష్ట్ర రంగస్థల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు తడకళ్ల రామచంద్రరావు అన్నారు. కోమలి కళా సమితి నల్లగొండ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాకేంద్రంలోని చినవెంకటరెడ్డి ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి నాటకోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిక నైతిక విలువలను పెంపొందిస్తుందన్నారు. నాటికలు అనేక రకాలుగా ఉంటాయని, వాటిలో హాస్య, విషాద, చారిత్రక, సామాజిక నాటకాలు ఉన్నాయన్నారు. నాటికలకు ఒకప్పుడు ఎక్కుగా ఆదరణ ఉండేదని, ప్రజలు నాటికలను భాగా చూసేవారన్నారు. టీవీలు, సినిమాల ప్రభావంతో మరుగున పడిపోతున్నాయన్నారు. ప్రజల నడవడిక, మనుగడ ప్రధానంగా నాటికల్లో కనిపిస్తాయన్నారు. ప్రస్తుతం సినిమాల్లో, టీవీల్లో నటించే కళాకారులు ఒకప్పుడు రంగస్థలం నుంచి వచ్చినవారేనని అన్నారు.

ఆకట్టుకున్న స్వప్నం రాల్చిన అమృతం నాటిక

ఈ సందర్భంగా స్వప్నం రాల్చిన అమృతం నాటికను ప్రదర్శించారు. రమేష్ దర్శకత్వంలో రూపొందించిన ఈ నాటిక భార్యాభర్తల బంధానికి అనుబంధానికి విలువనిచ్చేది. 'కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా... అని తెలియజేప్పేదే నాటిక సారాంశం. నటీ, నటులు తమ పాత్రలకు తగినట్లుగా పోషించారు. అనంతరం 'ఈ మంచం నాదికాదు' అనే నాటికను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంవీఆర్ విద్యా సంస్థల చైర్మన్ కొలనుపాక రవికుమార్, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జి. వెంకటరెడ్డి, జెల్లా శ్రీశైలం, కోమలి కళా సమితి వ్యవస్థాపకుడు బక్క పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు పి. రఘుపతి, ప్రధాన కార్యదర్శి ఎంఎల్. నర్సింహారావు, ఉపాధ్యక్షుడు కుమార్, బాబు, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



అమృతం నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

ఎరువు భారం.. సాగు దూరం

» డీఏపీ, యూరియా మినహా మిగతా ఎరువుల ధర పెంపు » బస్తాకు రూ.50 నుంచి రూ.330 పెరుగుదల » ఆందోళనలో అన్నదాతలు



వర్షాకాలం ప్రారంభమై నెల పదిహేను రోజులు అవుతోంది. వర్షాలు లేక, వ్యవసాయం సాగక రైతుల బాధ వర్ణనాతీతంగా ఉంది. దీనికి తోడు ఎరువుల కంపెనీలు కాంప్లెక్స్, పొటాష్ ధరలు పెంచడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పంటల మద్దతు ధర పెంచిన వెంటనే ఎరువుల ధరలు పెరగడంతో పంటల మద్దతు ధర పెంచి ఏం లాభమని రైతులు వాపోతున్నారు. ధాన్యం మద్దతు ధర క్వింటాకు రూ.69 పెంచగా, ఎరువుల ధరలు రూ.50 నుంచి రూ.330ల వరకు పెరిగాయి.

- ఆంధ్రజ్యోతి, మోత్కూరు

ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియా మినహా మిగతా అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు, పొటాష్ ధరలు భారీగా పెంచాయి. డీఏపీ ఎక్కువగా వాడడం వల్ల భూమిలో భాస్వరం నిల్వలు పెరిగిపోతున్నాయని రైతులు డీఏపీ తగ్గించి ఇతర కాంప్లెక్స్ ఎరువులే వాడుతున్నారు. పెరుగుతున్న కూలి రేట్లు, యంత్ర పరికరాల ధరలకు తోడు ఎరువుల ధర పెరగడం, సమయానుకూలంగా వర్షాలు కురియక పోవడంతో రైతులు వ్యవసాయ చేయక పోవడమే మేలన్న ఆలోచనకు వస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి సరుకుల ధరలు పెరిగినందునతయారీ ఖర్చులు భారమై తమకు గిట్టుబాటు కావడంలేనందున ఎరువుల ధరలు పెంచినట్టు కంపెనీల యజమానులు చెబుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. డీఏపీ (రూ.1350), 28-28-0(1700), యూరియా (రూ.266.50) రేట్లు మాత్రం పెరగలేదు. ఇప్పుడు మార్కెట్లో ధర పెరిగిన ఎరువుల బస్తాలే విక్రయిన్నారు.

యూరియా కొరత...

ఉమ్మడి జిల్లాలో వర్షాలు లేక ఎరువుల వాడకం పెద్దగా లేకపోయినా యూరియా కొరత ఏర్పడింది. బస్తా రూ.270 నుంచి రూ.280 అమ్మాల్సి ఉండగా తమకు డీలర్ షిప్ ఉన్నా ఎక్కువ ధర తీసుకుని స్టాకిస్టులు ఇస్తున్నారని చెబుతూ వ్యాపారులు రూ.330 వరకు అమ్ముతున్నట్టు రైతులు చెబుతున్నారు. యూరియా సరఫరా తగ్గించి నానో(ద్రవం) యూరియా వాడాలని చెబుతున్నారని, రైతులు నానో యూరియా పట్ల ఆసక్తి చూపడం లేదని వ్యాపారులు చెబుతున్నారు.

రైతులపై అదనపు భారం

డీఏపీ కాకుండా ఏడాదికి రైతులు యాదాద్రిభువనగిరి జిల్లాలో సుమారు 36వేల టన్నుల కాంప్లెక్స్, సూర్యాపేట జిల్లాలో సుమారు 71వేల టన్నుల కాంప్లెక్స్, నల్లగొండ జిల్లాలో సుమారు 1.14లక్షల టన్నుల కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తారని అంచనా. ఉమ్మడి జిల్లాలో వాడకం 2.21లక్షల టన్నుల వాడకం అంటే 22.10 లక్షల క్వింటాళ్లు అనగా 44.20 లక్షల బస్తాలు అన్నమాట. బస్తాకు సగటున రూ.150 చొప్పున పెరుగుదల చూసుకున్నా మొత్తం కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వల్ల ఉమ్మడి జిల్లా రైతులపై 66.30 కోట్లు అదనపు భారం పడుతుంది. పొటాష్ సూర్యాపేట జిల్లాలో సుమారు 2వేల టన్నులు, యాదాద్రిభువనగిరి జిల్లాలో 9వేల టన్నులు, నల్లగొండ జిల్లాలో 7వేల టన్నులు వాడతారని అంచనా. ఉమ్మడి జిల్లాలో 18వేల టన్నుల వాడకం ఉంటే 1.80లక్షల క్వింటాళ్లు అనగా 3.60లక్షల బస్తాలు వాడతారన్నమాట. ఒక్కో బస్తాపై రూ.265 పెరిగితే మొత్తం పొటాష్ వినియోగంతో రైతులపై రూ.9.54లక్షలు అదనంగా భారం పడుతుంది. పొటాష్, కాంప్లెక్స్ ఎరువుల వాడకంపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రైతులపై 75.84 కోట్ల అదనపు భారం పడుతుంది.

వ్యవసాయం ఇప్పటికే గిట్టుబాటు కావడం లేదు



అదను ప్రకారం వర్షాలు కురియక, పంటలకు గిట్టుబాటు ధర లేక ఇప్పటికే ఏ పంట వేసినా గిట్టుబాటు కావడం లేదు. దీనికి తోడు ఎరువుల ధరలు పెంచారు. దీంతో మరింత నష్టం వస్తుంది. కంపెనీలు కాంప్లెక్స్, పొటాష్‌పై పెంచిన ధరలు తగ్గించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో పంటల సాగు తగ్గించుకోవాల్సిందే.

- బద్దం స్వామిరెడ్డి, రైతు, ఆరెగూడెం

పెరిగిన ధరలు

ఎరువు రకం	పాత ధర	కొత్త ధర	పెరుగుదల
పొటాష్	1,535	1,800	265
20-20-13 (ఫ్యాక్ట్)	1,300	1,425	125
20-20-13 (గ్రోమోర్)	1,300	1,350	50
20-20-13(పీపీఎల్)	1,300	1,400	100
10-26-26	1,470	1,800	330
12-32-16(ఇఫ్కో)	1,470	1,720	250
16-16-16	1,450	1,600	150
15-15-15-0-9	1,450	1,600	150
16-20-0-13	1,250	1,300	50
24-24-0(మహాధన్)	1,700	1,800	100
20-20-0-13(మహాధన్)	1,350	1,450	100
14-35-14(గ్రోమోర్)	1,700	1,800	100
సింగిల్ సూపర్‌పాస్ఫేట్	580	640	60

గతంలో ఇచ్చిన హామీ ఏమైంది?

● ఆర్డీవోను ప్రశ్నించిన భూనిర్వాసిత మహిళలు ● కొనసాగుతున్న చర్లగూడెం రిజర్వాయర్ నిర్వాసితుల ఆందోళన



ధర్నా వద్ద భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న చండూరు ఆర్డీవో శ్రీదేవి

మర్రిగూడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): 'పునరావాసం కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీకి అతీగతి లేదు.. పునరావాసంపై మాకు బాండ్ పేపర్ రాసి ఇచ్చి ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తాం' అని నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని చర్లగూడ రిజర్వాయర్ భూ నిర్వాసిత మహిళలు స్పష్టంచేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో చర్లగూడ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన చర్లగూడెం నిర్వాసితులు చర్లగూడెం ప్రాజెక్టు పనులు అడ్డుకొని క్యాంపు కార్యాలయం వద్ద టెంట్‌వేసి మంగళవారం రెండో రోజు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న చండూరు ఆర్డీవో శ్రీదేవి అక్కడికి చేరుకొని భూ నిర్వాసితులతో మాట్లాడారు. అర్హులైన భూ నిర్వాసితులకు పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్రత్యేక ప్యాకేజీ అందిస్తామన్నారు. పనులు అడ్డుకోవద్దని, సహకరించాలని కోరారు. రెండు నెలల్లోనే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 12 సంవత్సరాలు కావొస్తున్నా అర్హులైన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పునరావాసం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం రిజర్వాయర్ వద్దకు చేరుకొని చింతపల్లి మండలం వర్కాల గ్రామ సమీపంలోని సర్వేనెంబర్ 173లో ఉన్న 35 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారని, అక్కడ ఇళ్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని అన్నారు. మా సమస్యలు పరిష్కరించే వరకు పనులు అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ నిర్వాసితులు అపోహలు చెందకుండా కాస్త గడువు ఇవ్వాలని, పునారావాసం, ఆర్అండ్ఆర్ ప్రత్యేక ప్యాకేజీ అందించి న్యాయం చేస్తామన్నారు. బాధితులకు ఎంత నచ్చజెప్పినా వినకుండా ధర్నా కొనసాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్, డీటీ చంద్రశేఖర్. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్, ఇరిగేషన్ ఈఈ రాములునాయక్, డీఈ కాశీం, సీఐ దూది రాజు, ఎస్ఐ కృష్ణారెడ్డి, బాధిత భూ నిర్వాసితులు కేశవులు, వల్లపు రాంకోటి, సుగుణమ్మ, మారమ్మ, బడేటి యాదయ్య, మాధాగోని శ్రీను ఉన్నారు.

నిర్వాసితుల వంటా వార్పు

పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని క్యాంపు కార్యాలయం వద్ద మహిళలు వంటవార్పు నిర్వహించారు. చర్లగూడెం రిజర్వాయర్‌లో సర్వం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన 335 మందికి పునరావాసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నారన్నారు. సమస్యలు, డిమాండ్ల పరిష్కరించే వరకు దీక్షలో పాల్గొంటామని తెలిపారు. దీక్ష కార్యక్రమంలో సుగుణమ్మ, యాదమ్మ, మారమ్మ, గొప్పమ్మ, రాజమ్మ, వెంకటయ్య, మల్లయ్య ఉన్నారు.

పనులు సమర్థంగా చేపట్టాలి

చర్లగూడెం రిజర్వాయర్ పనులను సమర్థంగా చేపట్టాలని చండూరు ఆర్డీవో శ్రీదేవి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్‌లో ముంపు గురైన చర్లగూడెం ముంపు గ్రామ బాధితులకు పునరావాసం కల్పించేందుకు స్థలం సేకరించినట్లు తెలిపారు. బాధితుల వివరాలు జాబితాలకు సంబంధించిన నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. భూభారతి అర్జీలకు ఆగస్టు 14 వరకు పూర్తి చేయాలని తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి నివేదిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్య కల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేద మంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాత సేవలతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖ మండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు పాంచారాత్రగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వర స్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో అంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ నిర్వహించారు. వివిధ విభా గాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 12,96,792 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీనరసింహుడి క్షేత్రంలో స్వామి వారి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు భక్తులకు నీరాజనమంత్రపుష్పాలతో మహానివేధన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో సిరికొండనవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణామాచార్యులు, రామాచార్యులు, మంగాచార్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు అభినందనీయం

● సహకార, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

● డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి అవార్డు ప్రదానం



మంత్రి తుమ్మల నుంచి అవార్డు అందుకుంటున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్(డీసీసీబీ) రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని సహకార, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఎక్స్‌రోడ్‌లో ఉన్న నాబార్డు రీజినల్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డికి రాష్ట్ర ఉత్తమ అవార్డు అంద జేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కుంభం శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన సంవత్సర కాలంలోనే నల్లగొండ డీసీసీబీని అభివృద్ధి పథంలో నడిపించడం అభినందనీయమన్నారు. అధికారులు, ఉద్యోగులతో చైర్మన్ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతో రూ.3వేల కోట్ల టర్నోవర్‌కు వరకు చేరుకుంటుందన్నారు. డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సహకారంతో బ్యాంకును అభివృద్ధి చేస్తున్నామన్నారు. నల్లగొండ డీసీసీబీని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా పాలకవర్గం కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర ఉత్తమ అవార్డు అందుకోవడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. బ్యాంకును అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. బ్యాంకు సీఈవో శంకర్రావుకు కూడా అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో అపెక్స్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరావు, ఆర్‌సీఎస్ సురేంద్రమోహన్, నాబార్డ్ అధికారి ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డార్మెటరీ హాల్ ఉన్నా.. లేనట్లే?

● కొండపై బస్టాండ్ ప్రాంగణంలోనే భక్తుల నిద్ర ● ఏడాది కావస్తున్నా రెండోహాల్ తాళం తీయని అధికారులు



గత ఏడాది ప్రారంభించిన డార్మెటరీ హాల్



కొండపైన బస్టాండు ఆవరణలో డార్మెటరీ హాల్

యాదగిరిగుట్ట, జూలై 15(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అంతర్జాతీయ దివ్య క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తులకు అదేస్థాయిలో సేవలు అందడం లేదు. స్వామివారిని దర్శించుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. వీరి కోసం కొండపైన రెండు డార్మెటరీ హాళ్లు ఉన్నాయి. ఒకటి అందుబాటులోకి రాగా, సుమారు ఏడాది కావస్తున్నా రెండోహాల్‌కు వేసిన తాళం తీయడం లేదు. పాత ఆచారాల పునరుద్ధరణ అని అధికారులు చెబుతున్నా సాధారణ భక్తులను మాత్రం విస్మరించారు. డార్మెటరీహాల్ ఉన్నట్లు అవగాహన లేని సాధారణ భక్తులు ఈనెల 13వ తేదీ(ఆదివారం) బస్టాండ్ ప్రాంగణంలో తాత్కాలిక డార్మెటరీ హాల్ ఎదురుగా భక్తులు రోడ్డుపైనే నిద్రించారు. దేవస్థాన ప్రధాన కార్యాలయం ఎదురుగా తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయం నుంచే బస్సుల రాకపోకలు కొనసాగాయి. భక్తులకు సరైన సూచనలు, సలహాలు ఇచ్చేందుకు కూడా అధికారులు, ఉద్యోగులు, భద్రత, ఎస్పీఎఫ్ సిబ్బంది అందుబాటులో లేరు.

అందుబాటులోకి రాక..

2024 మార్చి 15న భక్తులు నిద్రించేందుకు ఉచిత దర్శనం క్యూలైన్ పక్కన ఒకటో డార్మెటరీ హాల్ ప్రారంభించినా సూచిక బోర్డు ఏర్పాటును విస్మరించారు. రెండో హాల్ అందుబాటులో రాక భక్తులు బస్టాండ్ ప్రాంగణంలో రోడ్ల పక్కనే భక్తులు నిద్రిస్తుండగా కొండపైన ఎక్కడ లాకర్ సౌకర్యం లేక వారి వెంట తెచ్చుకున్న వస్తువులకు భద్రతలేదు. 100 మంది భక్తులు నిద్రించేందుకు అందుబాటులో ఉన్నా డార్మెటరీ హాల్ ఎక్కడ ఉందో తెలియక నిరుపయోగగంగా ఉంది. వేర్వేరు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు డార్మెటరీ హాల్ ఎక్కడ ఉందో తెలుసుకోలేకపోతున్నారు. దేవస్థాన ప్రధాన కార్యాలయం ఎదురుగా బస్టాండ్‌లోనే 500మంది నిద్రించేందుకు చుట్టూ ఇనుప కంచె వేసి ప్లాస్టిక్ రేకులతో రెండో డార్మెటరీ సిద్ధం చేశారు. సుమారు ఏడాది కావొస్తున్నా నేటికీ భక్తులకు అందుబాటులోకి రాలేదు. దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు చొరవ చూపి సాధారణ భక్తులకు డార్మెటరీ హాళ్లు అందుబాటులోకి తెచ్చి వాటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

పెన్షనర్లు 21లోపు ఎస్‌టీవోలో సంతకం చేయాలి

నాగార్జునసాగర్, జూలై15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డీటీవోల పరిధిలో ఎస్టీఈవోల్లో 75 సంవత్సరాలు పైబడిన పెన్షనర్లు ఫిజికల్ వెరిఫికేషన్ కోసం ఈ నెల 21వ తేదీలోపు సంతకాలు చేయాలని జిల్లా ట్రెజరరీ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డీటీవోల పరిధిలో అన్ని ఎస్టీవోల్లో ఉన్న పెన్షనర్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, ఫోన్ నంబరు, పీపీవో ఐడీ జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని పేర్కొన్నారు. మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని తెలిపారు. పెన్షనర్లు అనారోగ్యంతో కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటే వారి గురించి ఏమి చేయాలో త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఆధునికీకరణ ఎప్పుడో?

నిజాంకాలం 1942లో నిర్మించిన డిండి ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోలేదు. ప్రాజెక్టుకు ఉన్న రిజర్వాయర్ హెడ్ రెగ్యులేటర్‌కు మూడు షట్టర్లు ఉండగా మధ్య షటర్ నుంచి నిరంతరాయంగా నీరు లీకేజీ అవుతోంది. షటర్ గ్రూ సరిగా కూర్చోకపోవడంతో రబ్బరు సీలు నుంచి నీటి లీకేజీ అవుతుంది. నీటి లీకేజీని అదుపు చేసేందుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. స్పిల్‌వే వియర్ ముందు భాగంలో ఉన్న కంపచెట్లను తొలగించలేదు. దీంతో ప్రాజెక్టు ఓవర్‌ఫ్లో అయ్యే సమయంలో నీరు సాఫీగా వెళ్లడంలేదు.

● ఆంధ్రజ్యోతి, డిండి



'జీఎంపీఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

చౌటుప్పల్ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భువనగిరిలో ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించే గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నర్సింహ కోరారు. మహాసభల కరపత్రాలను మంగళవారం చౌటుప్పల్ పట్టణంలో విడుదల చేశారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకులు కొండె శ్రీశైలం, బాలరాజ్, పాండు, మల్లేశం, జంగయ్య, రమేష్, బీరప్ప, అయిలయ్య పాల్గొన్నారు.

'అదరని ఓ బాటసారి' ఆడియో క్యాసెట్ విడుదల

మోత్కూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మందుల సామే లు జన్మదినాన్ని పురస్కరించుకుని బండారి ముదిరాజు సహకారంతో రూపొందించిన 'అదరని ఓ బాటసారి...జనులకు జవాబుదారి' పాటల క్యాసెట్‌ను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే మందుల సామేలుతో ఆవిష్కరింపజేశారు. ఈ పాటను చంద్రగిరి ప్రశాంత్ రాసి, పాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాచకొండ బాలరాజు, చిరుమర్తి యాదయ్య, గుండా రాములు, చల్ల యాదయ్య, బట్టు మొగులయ్య పాల్గొన్నారు.

ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నిల్



పిల్లలులేని గొల్లగుడిసెలు పాఠశాల

పై అధికారుల దృష్టికి తీసుకువెళతా



గొలగుడిసెల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రావడం లేదని ఉపాధ్యాయురాలు వేణుమాధవి ఈ నెల 14న ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులు దృష్టికి తీసుకువెళ్లి, వారి ఆదేశం మేరకు నిర్ణయం తీసుకుంటాం.

-శరత్‌యామిని, ఎంఈవో

యాదగిరిగుట్ట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో కనీసం ఒక విద్యార్థి కూడ లేడు ... గతంలో చేరిన ఒకరిద్దరు చేరిన విద్యార్థులు కూడ ప్రైవేట్ పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ పరిస్థితి ఆ పాఠశాల ఉపాధ్యాయురాలికి పెనుశాపంగా మారింది. విద్యార్థుల జాడే కనిపించని ఆ పాఠశాలకు ప్రతీ రోజు వెళ్లి తిరిగి రావడం ఆ పాఠశాల ఉపాధ్యాయురాలికీ ఇబ్బందిగానే ఉంది. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలును మరో పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపాల్సి ఉన్నా అధికారుల నుంచి ఇప్పటివరకు స్పందన కానరాలేదు.

యాదగిరి గుట్ట మండలంలోని దాతరుపల్లి మధిర గ్రామమైన గొల్లగుడిసెలు గ్రామంలో 35 సంవత్సరాల క్రితం ఒకటవ తరగతి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించారు. అప్పట్లో సుమారు 40 మంది వరకు విద్యార్థులు ఆ పాఠశాలలో చదువుకునేవారు. అనంతరం విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చి గత సంవత్సరం నుంచి విద్యార్థులు గణనీయంగా తగ్గి మూత పడే స్థితికి చేరింది. మూసివేసిన పాఠశాలలను తిరిగి తెరవాలని, విద్యార్థులు రావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాని ప్రభుత్వం జిల్లాస్థాయి అధికారుల ఆదేశాలతో మళ్లీ ఆ పాఠశాలను తెరిచి ఆర్.వేణుమాధవి అనే ఉపాధ్యాయురాలిని కేటాయించారు. జూన్ నెలలో గ్రామంలో ఇంటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలకు పంపాలని కోరారు. ముగ్గురు విద్యార్థులు మాత్రమే పాఠశాలలో చేరారు. ఈ ముగ్గురు పిల్లలకు పాఠాలు ఎలా బోధిస్తారని ఆ పిల్లల తల్లిదండ్రులు వారిని ప్రైవేట్ పాఠశాలకు పంపించారు. దీంతో 16రోజులుగా ఉపాధ్యాయురాలు ఒక్కరే పాఠశాలను తెరిచి ఒంటరిగా కూర్చుని వెళుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి ఫోన్‌ద్వారా సమాచారం ఇచ్చి తనను వేరే పాఠశాలకు డిప్యుటేషన్‌పై పంపించాలని కోరుతున్నారు. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో ఈ నెల 14వ తేదీన స్థానిక ఎంఈవో శరత్‌యామినిని కలిసి ఫిర్యాదు చేశారు.

ఇక ధాన్యం ఆరబెట్టే శ్రమలేదు

- మార్కెట్‌యార్డుకు యంత్రం వచ్చేసింది
- రైతుల్లో హర్షం


చౌటుప్పల్ మార్కెట్ యార్డులో ధాన్యం ఆరబెట్టే ప్యాడీ డయ్యర్ యంత్రం

చౌటుప్పల్ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గాను అధునాతన యంత్రం (ప్యాడీ డయ్యర్)ను ప్రభుత్వం సమకూర్చింది. దీంతో రైతులకు జరిగే అనవసర వ్యయం తగ్గిపోతుండడంతో హర్షం వ్యక్తమవుతోంది. వ్యవసాయ మార్కెట్ నిధుల నుంచి రూ.14.40 లక్షలను కేటాయించి, ఈ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌యార్డులో భద్రపరిచారు. ధాన్యంతో ట్రయల్ రన్ కూడా చేశారు. ప్యాడీ డయ్యర్ రైతుల ధాన్యాన్ని ఆరబెట్టేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది. ధాన్యాన్ని ఆరబెట్టడం, రాశులు చేయడం వంటి బాధలు ఇక నుంచి రైతులకు తప్పనున్నాయి. వ్యవసాయ పొలాల వద్ద కల్లాలు లేని ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్యాడీ డయ్యర్ ప్రాముఖ్యతను సంతరించుకుంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టి రాశులు పోసుకునేందుకు గాను రైతులకు అధిక వ్యయం అవుతోంది.

ఇక నుంచి ఇలాంటి ఖర్చులు, రైతుల శ్రమ తొలగిపోనున్నాయి. వానా కాలం సీజన్‌లో ఈ యంత్రం 24 గంటలు పని చేయవలసి ఉంటుంది. ఇప్పటికే మా ర్కెట్ యార్డులో ప్యాడీ క్లీనర్ అందుబాటులో ఉంది. ప్యాడీ డయ్యర్, ప్యాడీ క్లీనర్ లతో రైతులకు ఎంతో ఉపయోగం జరగనుంది. ఈ ప్యాడీ డయ్యర్‌ను మార్కెట్ యార్డుకు కేటాయించేందుకు అదనపు కలెక్టర్ వీరారెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

పనిచేసే విధానం..

ప్యాడీ డయ్యర్‌లో ఒక దఫాలో 60 బస్తాల(24 క్వింటాళ్లు) వరి ధాన్యాన్ని ఒక గంటన్నర (90 నిమిషాలు) లో ఆరబెట్టవచ్చు. 45నిమిషాల వ్యవధిలో యంత్రంలో ధాన్యం నింపడం, 25 నిమిషాల్లో ధాన్యాన్ని డ్రై చేయడం, 20 నిమిషాల పాటు ధాన్యాన్ని కూల్ చేయడం వంటి చర్యలు కొనసాగుతాయి. ట్రాక్టర్ సాయంతో ఈ యంత్రం పనిచేస్తుంది. అందులో ధాన్యాన్ని డ్రై చేసేందుకు మాత్రం ప్రత్యేకంగా పని చేసే హీటర్‌కు డీజిల్‌ను ఉపయోగించవలసి ఉంటుంది. ట్రాక్టర్‌తో పాటు డ్రై హీటర్‌కు అవసరమైన డీజిల్‌ను రైతు సమకూర్చు కోవలసి ఉంటుంది.

ప్యాడీ డయ్యర్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు గాను ప్యాడీ డయ్యర్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఏఎంసీ సెక్రటరీ రవీందర్ రెడ్డి తెలిపారు. వానా కాలం సీజన్ నుంచి ప్యాడీ డయ్యర్ వినియోగంలోకి వస్తుంది. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోని ఖర్చులను తగ్గించుకోవాలని ఆయన కోరారు.

-రవీందర్‌రెడ్డి, ఏఎంసీ సెక్రటరీ

ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత

● మునిసిపల్ కమిషనర్ రాజలింగం

భువనగిరి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా 44వ రోజు మంగళవారం 1, 10, 15, 18, 26, 28, 33వ వార్డులలో నిర్వహించిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల పరిశుభ్రత సాధ్యమవుతుందన్నారు. రహదారులను, మురికి కాల్వలను శుభ్రం చేశారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అండర్ అసైన్డ్ భవనాల కొలతల సేకరణ ఆవశ్యకతను వివరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాఫర్‌అలీ, హెల్త్ అసిస్టెంట్ రజిత, రెవెన్యూ అధికారి ప్రశాంతి ఆర్‌ఐలు, నరేష్ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

చౌటుప్పల్ ఏఎంసీ చైర్మన్ వెంకటయ్య

చౌటుప్పల్ టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. పట్టణంలోని 13వ వార్డులోని వెంకటరమణ కాలనీలో హెచ్ఎండీఏ నిధులు రూ.10లక్షలతో చేపట్టే 150 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం మునిసిపల్ కమిషనర్ జి.వెంకట్రామ్‌రెడ్డితో కలిసి చైర్మన్ వెంకటయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో పట్టణంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టినట్టు ఆయన తెలిపారు. మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఖాళీ స్థలాలతో పాటు ఇంటి ఆవరణలలో మొక్కలను నాటి సంరక్షించుకోవాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్, మాజీ వైస్ ఎంపీపీ బొంగు జంగయ్య, నాయకులు బత్తుల విప్లవ్, ఎం.రమేష్, బాలకృష్ణ, టి.రవి, వి.కుమార్ పాల్గొన్నారు.

'అధికారులు రైతులకు సమాచారం ఇవ్వడంలేదు'

గుండాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు సమాచారం లేకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పోతరబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ పట్టాదారు రైతులకు సమాచారం ఇవ్వకుండా పంచనామాకు వెళ్లిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపడిశాల గ్రామంలో సర్వే నెంబర్ 214లో నీరటి లక్ష్మీకి సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ అధికారులు విచారణ జరిపారని తెలిపారు. గ్రామాల్లో అధికారులు ఇలాంటి చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ హరికృష్ణకు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మద్దెపురం రాజు, నాయకులు బత్తిని భిక్షం, బాలయ్య, అంజనేయులు, యాదమ్మ ఉన్నారు.

అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలి

గుండాల, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆదర్శ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారికి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల సమయంలో బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు కొన్ని క్లాసులు మిస్సవుతున్నాయని దీంతో విద్యార్థులు చదువుల్లో వెనుకబడి పోతున్నారన్నారు. వెంటనే సంబంధిత అధికారులు పాఠశాల సమయంలో విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని లేనిచో ఆందోళన చేపడుతామన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేముల నాగరాజు, నాయకులు సతీష్, కల్యాణ్, రాము, మమత పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

చౌటుప్పల్ రూరల్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జడ్పీసీఈవో శోభారాణి అన్నారు. మండల పరిధిలోని దండుమల్కాపురంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. నిబంధనలకు అనుగుణంగా ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు నిధుల కొరత లేదని పేర్కొన్నారు. మురికి కాల్వ చివరి ప్రాంతాల్లో నిర్మిస్తున్న భారీ ఇంకుడు గుంతను పరిశీలించారు. అనంతరం నర్సరీ మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సందీప్‌కుమార్, పీఆర్ఏఈ హరీశ్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో పోలీసుల తనిఖీలు

ఆలేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలపై మంగళవారం ఆలేరు రైల్వే స్టేషన్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు, ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్, సీఐలు కొండల్‌రావు, దీపికల ఆధ్వర్యంలో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేపట్టారు. ఈ మధ్య కాలంలో యువత డ్రగ్స్, గంజాయిలకు బానిసలవుతున్నారని వారిని సక్రమ మార్గంలో నడిపించాలన్న ఉద్దేశంతో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. యువత చదువుపై దృష్టి కేంద్రీకరించాలన్నారు.

సీసీకెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

ఆలేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆలేరు పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చోరీల నియంత్రణకు ప్రజలు తమ వీధుల్లో దుకాణాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆలేరు ఎస్‌హెచ్‌వో సీఐ కొండల్‌రావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీసీకెమెరాలు ఉంటే చోరీలకు పాల్పడే దొంగలను పట్టుకోవడానికి సులవు అవుతుందన్నారు. బంగారు ఆభరణాలు ఇళ్ల వద్ద పెట్టి దూర ప్రాంతాలకు వెళ్లరాదన్నారు. చోరీల నియంత్రణకు రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. చోరీలపై ప్రజలు భయాందోళన వీడాలని కోరారు.

ర్యాంప్‌పై అధికారులకు అవగాహన

రాజాపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ర్యాంప్ ప్రాజెక్టను తెచ్చిందని జిల్లా ఈడీసీ మేనేజర్ రంజిత్ కుమార్ తెలిపారు. మంగళవారం రాజాపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, నూతన పరిశ్రమల ఏర్పాటు, డీట్ పోర్టల్ ఆవశ్యకత తదితర అంశాలపై వివరించారు. అనంతరం డీట్ పోర్టల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, ఎంపీవో కిషన్, ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ మహేశ్ పాల్గొన్నారు.

తుదిదశకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల శిక్షణ

(5వ పేజీ తరువాయి)

భూ కొలతలు ఎలా చేయాలన్నది నేర్పిస్తారు. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో సర్వేయర్లతో కలిసి అభ్యర్థులు భూముల కొలతలు చేపట్టారు. మాన్యువల్‌తోపాటు డీజీపీఎస్ యంత్రంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నారు.

నోటీసులు జారీ

భూభారతి చట్టం కింద రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి నోటీసులు జారీ చేసే ప్రక్రియను జిల్లా యంత్రాంగం ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. తహసీల్దార్ కార్యాలయాల్లో నోటీసులు సిద్ధం చేస్తున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకున్నారు. ప్రస్తుతం అన్ని మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లాలో 14,328 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తి చేశారు. దరఖాస్తుదారులకు భూ సమస్య దేని ప్రకారం పరిష్కారమైంది? ఎందుకు పరిష్కారం కాలేదు? తీసుకోవాల్సిన చర్యలపై సమగ్రంగా సమాధానం ఇచ్చేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తుకు ఎండార్స్‌మెంట్(సమాధాన నోటీసు)ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు సిద్ధమవుతున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో రెవెన్యూ గ్రామాల వారీగా నోటీసులు అందజేయనున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించడానికి బృందాలను ఏర్పాటుచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూభారతి చట్టం అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల్లో అధిక శాతం సర్వేనెంబర్లు, పేర్ల మిస్సింగ్‌లతో పాటు సాదాబైనామా దరఖాస్తులు ఉన్నాయి.

పరీక్షలకు ఏర్పాట్లు చేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పాలిటెక్నిక్, ఐటీఐ, సివిల్, బీటెక్ అభ్యసించిన వారికి లైసెన్స్‌డ్ సర్వేయర్ల కోసం శిక్షణ ఇస్తున్నాం. జిల్లాలో మొత్తం 180 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరికి థియరీ తరగతులు పూర్తయ్యాయి. ఐదు బ్యాచ్‌లుగా విభజించి క్షేత్రస్థాయిలో మాన్యువల్ తోపాటు డీజీపీఎస్ యంత్రంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. ఒరిజినల్ రికార్డుల ప్రకారం సర్వే చేయడంపై అనుభవజ్ఞులైన సర్వేయర్లతో శిక్షణ ఇస్తున్నాం. పలు మండలాల్లో ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే శిక్షణలు కొనసాగుతోంది. అంతేగాక ఈ నెల 27 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

-మధుసూదన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ

బీసీ రిజర్వేషన్‌ను కేంద్రం ఆమోదించాలి


వినతిపత్రం అందజేస్తున్న బీసీహక్కుల సాధన సమితి నాయకులు

భువనగిరి (కలెక్టరేట్), జూలై 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ చట్టాన్ని కేంద్రప్రభుత్వం ఆమోదించాలని కోరుతూ మంగళవారం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏవో జగన్మోహన్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ భారతదేశంలో 1931లో బ్రిటీష్ వారుచేసిన కుల గణన తరువాత ఇప్పటి వరకు ఏ ప్రభుత్వమూ చేపట్టలేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కుల గణనతో జనాభా గణన చేస్తామని హామీ ఇచ్చి చేయలేదని కుల, జన గణనను చేట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ చట్టాన్ని కేంద్ర వెంటనే షెడ్యూల్ 9లో చేర్చాలని, దామాషా ప్రకారం 50 శాతం ఉద్యోగాలను, చట్ట సభల్లో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సాధన సమితీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కళ్లెం క్రిష్ణ, ఏశాల అశోక్, భిక్షపతి, సవిత, రమేష్, వెంకటేష్, పెంటయ్య సత్తయ్య తదితరులున్నారు.

మహాధర్నాకు తరలిన బీసీ నాయకులు

మోత్కూరు : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీపీఎఫ్ (బీసీ ప్రజా ప్రతినిధుల ఫోరం) ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదు ఇందిరా పార్క్‌వద్ద నిర్వహించిన ధర్నాకు మోత్కూరు మండలం నుంచి బీసీ సంఘాల నాయకులు భారీగా తరలివెళ్లారు. ధర్నాకు వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్, కొండ సోమల్లు, చౌగోని సత్యం గౌడ్, గజ్జి మల్లేష్ తదితరులు ఉన్నారు.

వరుణుడి కరుణకోసం పూజలు

రాజాపేట, జూలై15(ఆంధ్రజ్యోతి): రాజాపేట మండల కేంద్రంలో వర్షాలు కురువాలని మంగళవారం మహిళలు నీటి బిందెలతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక దేవాలయాల్లో పూజలు నిర్వహించారు.అభిషేకాలు నిర్వహించి వర్షాలు కురిపించాలని వేడుకున్నారు. అనంతరం బతుకమ్మ ఆడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భువనగిరి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం నిర్దేశిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో టౌన్ ఏఈ పి.సాయికృష్ణ తెలిపారు. పలు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇసుక దోపిడీపై చర్య తీసుకోవాలి

బొమ్మలరామారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొనసాగుతున్న ఇసుక దోపిడీపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వాలని అధికారులు చెబుతున్నా పట్టించుకోవడంలేదని అన్నారు. లబ్ధిదారుల కంటే బడా నాయకులు ఇసుక డబ్బులకోసం హైదరాబాద్ తరలిస్తున్నా స్థానికంగా ఉన్న తహసీల్దార్ పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని అన్నారు. మండలంలోని మునీరాబాద్, కాజీపేట, మేడిపల్లి గ్రామాల మీదుగా ఉన్న వాగు నుంచి ఇసుకను ఇష్టానుసారంగా అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఇసుక దోడీని ఆపాలని, లేని యెడల తహసిల్దార్ కార్యాలయాన్ని సీపీఎం ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

బొమ్మలరామారం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలు సాగు చేసే సమయాన అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించినట్లయితే పంట దిగుబడి అధికంగా వస్తుందని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ దుర్గేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని మైలారం గ్రామంలో నాణ్యమైన విత్తనం రైతులకు నేస్తం అనేక పథకంలో భాగంగా పలు రైతు క్షేత్రాలను సందర్శించారు. ఈ పథకం ద్వారా మండలంలోని 46 రైతులకు వరి చిరు సంచుల విత్తనాలు, 23మంది రైతులకు పెసర చిరు సంచులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో గ్రామానికి ఒక్కొక్కరు చొప్పున ఈ పథకం ద్వారా విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. మైలారం గ్రామంలో రైతులు నాటిన కేఎన్ఎం 1638 రకాన్ని పరిశీలించి తగిన సూచనలు అందించమన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి గ్రామంలో నాణ్యమైన విత్తనం అందించాలనేది ప్రభుత్వం ముఖ్య ఉద్దేశమని అన్నారు. లబ్ధిదారులకు ఇసుకను ఉచితంగా ఇవ్వావలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మౌనికతో పాటు రైతులు పాల్గొన్నారు.

మూడు శాఖల పంతంతో.. తీరని ప్రజల దప్పిక

(5వ పేజీ తరువాయి)


పైప్‌లైన్ నిర్మాణం ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా జరగని సరస్వతీ కాలనీ

ఈ పనులన్నింటినీ ప్రజారోగ్యశాఖ పర్యవేక్షించింది. ఇంతవరకు బాగానే ఉన్నా, కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనుల్లో సింహభాగం నేటికీ వృథాగానే ఉన్నాయి. అందుకు మునిసిపల్, ప్రజారోగ్యశాఖ మధ్య సమన్వం కొరవడటమే కారణమని తెలుస్తుంది. అలాగే ప్రతిపాదిత పైపులైన్, నీటి ట్యాంకుల నిర్మాణం పూర్తయిన వెంటనే డిమాండ్ మేరకు తాగునీటిని అందిస్తామన్న మిషన్ భగీరథ అధికారులు కూడా నీటి సరఫరాపై మౌనం దాల్చారు.

ఎందుకిలా?

ప్రజారోగ్యశాఖ చేపట్టిన పైపులైన్ పనులు అసంపూర్తిగా ఉండటం, నీటి సరఫరాపై మిషన భగీరథ అధికారులు మాట తప్పడంతోనే తాగునీటి సమస్య ఎదురవుతోందని మునిసిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పలు ప్రాంతాల్లో పైపులైన్ లింక్ పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండగా, ఇప్పటి వరకు పనుల వివరాలను చెప్పలేదని, పనులను అప్పగించలేదని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే ప్రజారోగ్యశాఖ అధికారులు మాత్రం అంచనాకు మించి పైప్‌లైన్ పనులు చేశామని, పనులు పూర్తయిన వెంటనే మునిసిపాలిటీకి అధికారికంగా అప్పగించామని, మిగిలి ఉన్న కొద్దిపాటి లింకు పనులను మునిసిపల్ నీటి సరఫరా విభాగం చూసుకోవాలని చెబుతున్నారు. నిధులు, సిబ్బంది ఉన్నా, చిన్నపాటి పనులను కూడా చేసుకోలేక ఎలా అని ప్రజాఆరోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. 2016లో పనులు చేపట్టే సమయంలో మిషన్ భగీరథ జలాలు ఇస్తామని చెప్పామని, కానీ ఆచరణ సాధ్యం కాదని తేలడంతో సికింద్రాబాద్ సైనిక్‌పురి రిజర్వాయర్ నుంచి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్ఎండబ్ల్యుఎస్) ద్వారానే డిమాండ్‌కు సరిపడా రక్షిత జలాల సరఫరాపై శ్రద్ధ చూపాలని 2017లోనే మునిసిపల్ అధికారులకు స్పష్టం చేశామని మిషన్ భగీరథ అధికారులు చెబుతున్నారు. మునిసిపాలిటీలో విలీన గ్రామాలైన బొమ్మాయిపల్లి, పగిడిపల్లి, రాయిగిరికి రూరల్ వాటర్ స్కీమ్ (ఆర్‌డబ్ల్యుఎస్) ద్వారా తామే తాగునీటిని సరఫరా చేస్తున్నామని మిషన్ భగీరథ అధికారులు పేర్కొంటున్నారు. ఇలా మూడు ప్రభుత్వశాఖల అధికారులు భిన్న ధోరణిల్లో ఉండటంతో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులు ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా నిలిచి, ప్రజలు తాగునీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

డిమాండ్‌కు సరిపడా సరఫరా లేదు

మిషన్ భగీరథ పనుల్లో భాగంగా ప్రజారోగ్యశాఖ చేపట్టిన పైపులైన్ పనులు కొన్ని ప్రాంతాల్లో నేటికీ అసంపూర్తిగా ఉన్నాయి. పలు బస్తీల్లో లింకు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే గోదావరి జలాలను సరఫరా చేస్తామన్న మిషన్ భగీరథ అధికారులు సాంకేతిక కారణాలు చూపుతూ వాయిదా వేస్తున్నారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-కొండల్‌రావు, భువనగిరి మునిసిపల్ డీఈ

క్షేత్రస్థాయిలో ఇలా..

హుస్నాబాద్ ఇందిరమ్మ కాలనీలో మిషన్ భగీరథ పథకం కింద 10లక్షల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకును నిర్మించారు. బస్తీల్లో పైప్‌లైన్ నిర్మించి ఇళ్లకు ఉచిత నల్లా కనెక్షన్లు కూడా ఇచ్చారు. ఇది పూర్తయి ఐదేళ్లు అవుతోంది. హెచ్ఎండబ్ల్యూఎస్ ద్వారా ప్రస్తుతం రోజువారీ సరఫరా అవుతున్న 5.7ఎంఎల్‌డీకి అదనంగా కనీసం మరో 2.5ఎంఎల్‌డీ నీటి సరఫరా జరిగితేనే ఇందిరమ్మ కాలనీ ట్యాంకు ద్వారా తాగునీరు సరఫరా సాధ్యమవుతుంది. అలాగే పట్టణంలోని నల్లగొండ రోడ్డు, జంఖానాగూడ, శివారు ప్రాంతమైన నందగుట్ట, సరస్వతీ నగర్‌తో పాటు పట్టణంలోని పలు బస్తీల్లో పైప్‌లైన్ లింకు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ప్రత్యామ్నాయంగా మునిసిపాలిటీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తుండగా, ఆర్థిక స్తోమత ఉన్న వారు బోరుబావులను ఏర్పాటుచేసుకున్నారు.

చిన్నపాటి పనులను మునిసిపాలిటీనే చేసుకోవాలి

టెండర్ ప్రక్రియకు మించి పనులు నిర్వహించాం. పూర్తయిన పనులను ఎప్పుడో మునిసిపాలిటీకి అప్పగించాం. ఆ తరువాత కూడా అధికారుల సూచనల మేరకు మరిన్ని పనులు చేశాం. మిగులు చిన్నపాటి పనులను మునిసిపాలిటీనే చేసుకోవాలి. అంతేగాని మాపై నెపం వేయడం సరికాదు. ప్రణాళిక లేకుండానే పలు పనులను ప్రతిపాదనల్లో చేర్చి మాతో పూర్తి చేయించడం సమస్యలకు కారణమవుతోంది. అయినప్పటికీ లింక్ తదితర పెండింగ్ పనుల వివరాలను అందజేస్తే అమృత్ 2.0 పనులతో పాటు ఆ పనులను కూడా పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.

-మనోహర్, ప్రజారోగ్యశాఖ డీఈ

రెండు నెలల్లో తాగునీటిని అందిస్తాం

భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో మునిసిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాలకు రోజువారీగా 62ఎంఎల్‌డీ నీటి సరఫరా జరగాల్సి ఉంది. కానీ పలు కారణాలతో 32 ఎంఎల్‌డీ మాత్రమే ఇవ్వగలుగుతున్నాం. రూ.210కోట్లతో మల్లన్న సాగర్ నుంచి ఘన్‌పూర్ గ్రిడ్ వరకు ప్రతిపాదించిన పైపులైన్ పనులు చివరి దశలో ఉన్నాయి. మరో 300 మీటర్ల పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ పనులు పూర్తయితే రెండు నియోజకవర్గాలతో పాటు భువనగిరి పట్టణం, మిగతా మునిసిపాలిటీలకు డిమాండ్‌కు సరిపడా తాగునీటినీ అందిస్తాం.

-కరుణాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ